క్లుప్తంగా

శాలిహుండం మెట్లమార్గం ప్రారంభం


మెట్ల మార్గం ప్రారంభిస్తున్న దృశ్యం

గార: శాలిహుండం గిరిపైకి వెళ్లేందుకు నూతనంగా నిర్మించిన మెట్ల మార్గాన్ని అనువంశిక ధర్మకర్త సుగ్గు మధురెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గతంలో ఉన్న మెట్ల మార్గం శిథిలావస్థకు చేరడంతో సొంత నిధులు రూ.6 లక్షల 50 వేలతో నూతనంగా మెట్ల మార్గం నిర్మించారు. ఫిబ్రవరి 1న జరగనున్న గిరి యాత్రలో ఈ మెట్ల మార్గంలోనే కాళీయ మర్ధన వేణగోపాల స్వామితో పాటు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుని ఉత్సవమూర్తులను వంశధారలో చక్రతీర్థ స్నానానికి తీసుకెళ్తారు.

పక్కాగా జగనన్న గోరుముద్ద


విద్యార్థులతో కలిసి భోజనాలు చేస్తున్న అధికారులు

జి.సిగడాం: పాఠశాలల్లో పక్కాగా జగనన్న గోరుముద్ద మెనూ అమలు చేయాలని డీఈవో పగడాలమ్మ స్పష్టం చేశారు. మండలంలోని పెంట యూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆమెతో పాటు ఎంఈవో అరసాడ రవి, హెచ్ఎం మజ్జి మదన్‌మోహన్, ఎండీఎం కో–ఆర్డినేటర్ కూర్మారావు, ప్రసాదరావు ఉన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం


రోడ్డు ప్రారంభిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఫరీదుపేటలో రూ.6 లక్షలతో నిర్మాణం చేపట్టిన సిమ్మెంట్ రోడ్డును ఎంపీపీ మొదలవలస చిరంజీవి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సీపాన వెంకటరావు, మొదలవలస కృష్ణ, సత్తారు గోపీ, పైడి రాజేష్, వాసు దేవరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు


సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని నాగావళి నదీతీరంలో బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో జరుగుతున్న రాజశ్యామలదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ముందుగా పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం కుంకుమపూజలు నిర్వహించారు.

'గురుగుబెల్లి'కి గురురత్న పురస్కారం


పురస్కారం అందుకుంటున్న దామోదరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరానికి చెందిన జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ గురుగుబెల్లి దామోదరరావు పలు పురస్కారాలు అందుకున్నారు. యువ సోషల్ సర్వీసెస్ జాతీయ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్.వై.ఎస్.చిన్నారావు ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా రాజమండ్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మదర్ థెరిస్సా సేవా పురస్కారం, అబ్దుల్ కలాం గురురత్న పురస్కారాలు అందుకున్నారు.

చేదోడు దరఖాస్తుల పరిశీలన

రణస్థలం: అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న చేదోడు పథకం అందజేయడం జరుగుతుందని ఎంపీడీవో వంద్రాంగి ధనుంజయరావు తెలిపారు. మండలంలోని సంచాం గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న చేదోడుకు దరఖాస్తులు చేసుకున్నవారి వివరాలను క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 762 మంది చేదోడుకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తులను గ్రామ సచి వాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పరిశీలించి ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన

● ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, నాయకులు

జి.సిగడాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన వచ్చిందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆనందపురం గ్రామంలో కార్యకర్తలతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో విజయం సాధించేందుకు గ్రామస్థాయిలో ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. వలంటీర్ వ్యవస్థతో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయని తెలియజేశారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. విద్య, వైద్యం, తాగు, సాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, బూరాడ వెంకటరమణ, డోల వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, సర్పంచ్‌లు చిత్తిరి మోహన్, సాకేటి నాగరాజు, బుడారి లక్ష్మణరావు, నాయకులు పిల్లల శివకుమార్, పెద్ది భాస్కరరావు, చందనాల రంగారావు, ధారపోయిన ధర్మారావు, మక్క సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు


లబ్ధిదారులకు కరపత్రాలు అందజేస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

● ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

గార: అర్హులైన పేదలందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. శుక్రవారం అంపోలు పంచాయతీ రామకృష్ణాపురం సచివాలయం పరిధిలోని గ్రామాల్లో సర్పంచ్ గొండు జయరాం ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి అందిన పథకాల ప్రయోజనాలను లబ్ధిదారులకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ ఏ రాష్ట్రంలోనూ మన ప్రభుత్వంలా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు జరగడం లేదన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మాటలు నమ్మితే మోసపోతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురాం, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, కన్వీనర్ పీస శ్రీహరిరావు, వైస్ ఎంపీపీ అరవల రామకృష్ణ, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, పీస గోపి, యాళ్ల నారాయణమూర్తి, గంగు రామారావు, సుంకాన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉండండి

● అగ్రి ఎంటర్‌ప్రెన్యూర్ ప్రోగ్రాంలో ఎమ్మెల్యే కృష్ణదాస్


శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు మరింతగా సేవలు అందించి అండగా నిలవాలని తద్వారా మీరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట, శ్రీకాకుళం రూరల్, గార, ఎచ్చెర్ల మండలాల్లో ఎంపిక చేసిన 45 మంది నిరుద్యోగ యువతీ యువకులకు అగ్రి ఎంటర్‌ప్రెన్యూర్ పేరిట సింజెంటా పురుగుల కంపెనీ సౌజన్యంతో 36 రోజుల పాటు పలు స్వచ్ఛంద సంస్థలు రైతులకు అందించే సేవలు, పంటలు, వాటి యాజమాన్య పద్ధతులపై శిక్షణ నిచ్చారు. వీరందరికీ ఎమ్మెల్యే చేతుల మీదుగా శుక్రవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు వీలుగా ప్రయోగాత్మకంగా వ్యవసాయ శాఖ సూచనలతో ఎంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్థులు బ్యాంకుల రుణాలు పొంది రైతులకు మేలు చేసేలా షాపులు పెట్టుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు శిమ్మ నేతాజీ, సింజెంటా ప్రతినిధి రామప్రసాద్, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ముద్దాడ బైరాగినాయుడు, గార ఎంపీపీ గొండు రఘు తదితరులు పాల్గొన్నారు.

జాతర కల్యాణ రాట నేడు

రణస్థలం: మండలంలోని కమ్మ సిగడాంలో వెలిసివున్న మహాలక్ష్మి తల్లి జాతర కల్యాణ రాటను శనివారం ఉదయం 9.45 నిమిషాలకు వేయనున్నట్లు ఆలయ కమిటీ నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఈశ్వరరావు శుక్రవారం ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 30, 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో అంగరంగ వైభవంగా జాతర జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు


కాలువల్లో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

లావేరు: మండలంలోని పెదలింగాలవలస గ్రామంలో సర్పంచ్ లుకలాపు యశోద, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లుకలాపు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఎం.రమణల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని చెత్తను తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రజలకు అవగాహన కల్పించారు.

తక్షణ సాయం అందజేత


తక్షణ సాయం అందజేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండల కేంద్రానికి చెందిన కురిటి రామప్పడు ఇటీవల మృతి చెందారు. దీంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను ఆయన భార్య కురిటి ముత్యాలుకు అధికారులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ కీర్తి తవుడమ్మ, పంచాయతీ కార్యదర్శి సాహు, వీఆర్వో భూపతి నర్సింగరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ భవ్యశ్రీ, డిజిటల్ అసిస్టెంట్ పాగిరి రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు ముద్దాడ గౌరీ, పిన్నింటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొత్తూరు: మండలంలోని నేరడి కూడలి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరపాడుకు చెందిన కడగల సాయిరాం గాయపడ్డాడు. కొత్తూరు నుంచి హిరమండలం వైపు బైక్‌పై వెళ్తున్న సాయిరాం నేరడి వద్దకు వచ్చే సరికి ఎదురుగా వెళ్తున్న లారీ ఒక్కసారి పక్కకు రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సాయిరాంకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ కృష్ణారావు తెలిపారు.

ద్విచక్ర వాహనాల వేలం నేడు

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను శనివారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ సీఐ వై.లక్ష్మునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ప్రహరాజపాలెం ఎస్ఈబీ కార్యాలయంలో జరిగే వేలంలో ఆధార్, రూ.1000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు శుక్రవారం ఆవిష్కరించారు. శ్రీకాకుళం నగరంలో సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి బుడుమూరు రాజేష్, జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువనేత మాట్లాడుతూ బీసీల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సంఘ నాయకుల కృషి అభినందనీయమన్నారు. బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక పథకాలు, నిర్ణయాలు తీసుకోవడంలో సంఘ నాయకుల కృషి ఎంతగానో ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన దేవభూషణరావు, కర్రి రంగాజీదేవ్, మంగరాజు, జంజూలూరు రామారావు, రవికుమార్, అప్పన్న, కేశవ, సురేష్, చందు, కుమార్, శ్రీను పాల్గొన్నారు.

సామాజిక దృక్పథం అలవర్చుకోవాలి


రిజిస్ట్రార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న బ్రహ్మ కుమారీస్

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు సామాజిక దృక్పథం అలవర్చుకోవాలని బీఆర్ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ అన్నారు. వర్సిటీ సెమినార్ హాల్లో కమ్యూనిటీ సర్వీసెస్ ప్రాజెక్టుపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మ కుమారీస్ సిస్టర్ పాల్గొని సమాజ సేవ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. రిజిస్ట్రార్ మట్లాడుతూ విద్యలో నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మ కుమారీస్ సిస్టర్ సంధ్య, విజయ పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దింపాలి


ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన అవసరం ఉందని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. భారత్ జోడోయాత్ర ముగింపు సందర్భంగా శుక్రవారం డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి ఆధ్వర్యంలో శ్రీకాకుళం వైఎస్సార్ కూడలి నుంచి ఇందిరా విజ్ఞానభవన్ వరకూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు క్రిస్టోఫర్ తిలక్, రాకేష్‌రెడ్డి, సనపల అన్నాజీ, పేడాడ పరమేశ్వరరావు, పైడి నాగభూషణరావు, డి.గోవిందమల్లిబాబు, అంబటి కృష్ణ, రెల్ల సురేష్, కెఎల్ ఈశ్వరి, కొత్తకోట సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ విద్యాసాగర్

జలుమూరు: సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది బాధ్యతగా పని చేయాలని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం జలుమూరు మండలం కొమనాపల్లి సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయపాలనతోపాటు అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. రుణాలు చెల్లింపులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జలుమూరు మహిళా మండలి సమాఖ్య సిబ్బంది, వెలుగు ప్రతినిధులకు సూచించారు. సంఘాల బలోపేతానికి చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న చేదోడు, చేయూత ద్వారా సంఘ సభ్యులు వ్యాపారాలు, ఆవులు పెంపకం, చేతివృత్తులు తదితరవి చేపట్టి జీవన ప్రమాణం మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్లను ఆదుకోవాలి

ఆమదాలవలస:


ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రైవేట్ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీనివాసరావు కోరారు. ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా శుక్రవారం ఆమదాలవలస పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా ప్రభావంతో వర్కర్స్ ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యారని చెప్పారు. ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎ.చంద్రశేఖర్, కె.హరి, డి.వి.జి.రమణ, వి.రవి, తేజ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు రథసప్తమి కళ


సామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రథసప్తమి సందర్భంగా శుక్రవారం శ్రీకాకుళం పెద్ద మార్కెట్ సందడిగా మారింది. రథసప్తమి నాడు స్నానం చేసేటప్పుడు తలపై జిల్లేడు ఆకు, రేగుపండు పెట్టుకొని స్నానమాచరించడం సంప్రదాయం. తరిగిన కూరలు కాకుండా చిక్కుడుకాయల కూర వండటం ఆనవాయితీ. చిక్కుడు కాయలతో సూర్య రథాన్ని తయారుచేసి తులసికోట వద్ద కొత్తబియ్యం, బెల్లంతో కలసి ఆవు పిడకలతో పాయసం చేసి పూజలు చేస్తారు. ఈ నేపథ్యంలో మార్కెట్లో చిక్కుడు ఆకులు, చిక్కుడు కాయలు, రేగుపళ్లు, బెల్లం కొనుగోళ్లు భారీగా జరిగాయి. మూడు చిక్కుడు ఆకులు రూ.10, చిక్కుడు కాయలు కేజీ రూ.80, చెరకు రూ.10 నుంచి రు.50 వరకు అమ్మకం సాగించారు.

వంద రోజుల పనిదినాలపై దృష్టి పెట్టండి


పనులు పర్యవేక్షిస్తున్న పీడీ చిట్టిరాజు

శ్రీకాకుళం రూరల్: క్షేత్రస్థాయిలో వంద రోజుల పనిదినాలపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకుడు జి.వి.చిట్టిరాజు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మోపసుబందరులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది గరిష్ఠ వేతనం పొందేందుకు సమయపాలన పాటిస్తూ రెండు పూటలా పనిచేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కూలీలు గరిష్ఠ వేతనం పొందేందుకు అవసరమైన సాంకేతిక సలహాలను సిబ్బంది ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ సీతారాం, జేఈ పి.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

లావేరు: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ మణి భూషణ్ సూచించారు. మండలంలోని గోవిందపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం ఏర్పాటు చేశారు. గ్రామంలోని చిన్నారులు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేస్తే ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని, పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంటాక్ వ్యవస్థాపక దినోత్సవం


మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ నూక సన్యాసిరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని అక్షర పాఠశాలలో శుక్రవారం ఇంటాక్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ నూక సన్యాసిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలు, కళలు, వారసత్వ సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఇంటాక్ పూర్వ కన్వీనర్ కె.వి.జె.రాధాప్రసాద్, కో కన్వీనర్ నటుకుల మోహన్, కార్యనిర్వాహక సభ్యులు డాక్టర్ బాడాన దేవభూషణరావు, హెచ్ఎం టి.నర్సింగరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు బాలికల జట్టు పయనం


బాలికల జట్టుతో హాకీ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: 13వ ఏపీ రాష్ట్ర జూనియర్స్ బాలికల హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయ దుందుభి మోగించాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.సుందరరావు ఆకాంక్షించారు. ఈ నెల 28 నుంచి 30 వరకు అనకాపల్లి జిల్లా యలమంచిలి వేదికగా జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు జిల్లా జూనియర్స్ బాలికల హాకీ జట్టు శుక్రవారం ఇక్కడి నుంచి పయనమై వెళ్లింది. వీరికి స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వద్ద వీడ్కోలు పలికారు. క్రమశిక్షణగా, పట్టుదలతో తుది వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. జట్టుకు కోచ్‌గా అల్లు అనిల్‌కుమార్ వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో కళాశాల పీడీ ఎ.మోహన్‌రాజ్, జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి మధుసూదన్, ఉపాధ్యక్షులు కె.లావణ్య, బి.ఈశ్వర్ ప్రసాద్, జె.రమేష్, ఎస్.సాయికుమార్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వివాహ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పాతపట్నం: ఆన్‌లైన్ వివాహ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మధరావు అన్నారు. పాతపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించేందుకు హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుకు వివాహ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసిందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమాపతి, సంతోష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయోత్పత్తుల నిల్వ కేంద్రానికి భూమిపూజ

పాతపట్నం: ప్రహరాజపాలెంలోని జగనన్న–లేఅవుట్ సమీపంలో రూ.15 లక్షలతో నిర్మించనున్న వ్యవసాయోత్పత్తుల నిల్వ కేంద్రం(ఎఫ్‌పీఓ) భవన నిర్మాణానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవనం అందుబాటులోకి వస్తే రైతులు తమ పంటలను నిల్వ చేసుకుని మద్దతు ధర వచ్చినప్పుడు అమ్మకాలు చేపట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఈఈ మురళి, ఎంపీపీ దొర సావిత్రమ్మ, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు కె.అర్జునుడు, తాతయ్య, ఏపీఎం మనోరత్నం, ఎం.రామారావు, మండల హార్టికల్చర్ అధికారి మంగమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పనుకు మోహన్ పాల్గొన్నారు.